

బీఆర్ఎస్ పార్టీలో చేరిన ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌ను బుధవారం ఉదయం మాజీ మంత్రి, బీఆర్ఎస్ మహబూబ్ నగర్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మారెడ్డి హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. బీఆర్ఎస్‌లో చేరినందుకు అభినందనలు తెలిపారు. అనంతరం జిల్లాలో పార్టీ కార్యక్రమాలతోపాటు వివిధ అంశాలపై చర్చించారు.
– జడ్చర్ల, మార్చి 20

# బ్యాంకు లోన్ ఇప్పిస్తానంటూ మోసం

జడ్చర్ల టౌన్, మార్చి 20 : బ్యాంకు లోన్ ఇప్పిస్తానంటూ మూడు నెలల ఈఎంఐ డబ్బులను వేయించుకొని మోసం చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. ఎస్సై కథనం మేరకు.. జడ్చర్ల మండలం మాచారం గ్రామానికి చెందిన రాజు ప్రైవేటు ఉద్యోగి. రెండేండ్ల కిందట యాక్సిస్ బ్యాంకులో పనిచేసే అరుణ్‌రాజ్.. రాజుకు పరిచమయ్యాడు. ఈ క్రమంలో రాజుకు బ్యాంకులో పర్సనల్ లోన్ ఇప్పించాడు. కొన్నాళ్ల తర్వాత మళ్లీ పర్సనల్ లోన్ టాప్‌ఆప్ చేయిస్తానంటూ రాజు వద్ద ముందస్తుగా మూడు నెలల ఈఎంఐ డబ్బులు రూ.1.27లక్షలు నిందితుడు అరుణ్ రాజ్ తన బ్యాంకు అకౌంట్‌లోకి వేయించుకున్నాడు. ఆ తర్వాత లోన్ టాప్‌ఆప్ కోసం ఎన్నిసార్లు అడిగినా సమాధానం ఇవ్వకుండా, తిరిగి డబ్బులు వాపసు ఇవ్వకుండా తిప్పుతుండడంతో అరుణ్ రాజ్ తనను మోసం చేశాడంటూ పేర్కొంటూ బుధవారం జడ్చర్ల పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.




దవాఖానలో చికిత్స పొందుతున్న మున్సిపల్ కార్మికులను పరామర్శిస్తున్న సీఐటీయూ నాయకులు

# కాంగ్రెస్ నేత దౌర్జన్యం

- మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్మికులపై కౌన్సిలర్ భర్త దాడి
- పారిపోతున్నా వెంబడించి కర్రలతో కొట్టిన నాయకుడు
- పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన బాధితులు
- దోషులను కఠినంగా శిక్షించాలి : సీఐటీయూ డిమాండ్

మహబూబ్‌నగర్ మెట్టుగడ్డ, మార్చి 20 : మహబూబ్‌నగర్ మున్సిపాలిటీలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులైన మహ్మద్ మోసిన్, చిన్నా అనే కార్మికులపై కాంగ్రెస్ కౌన్సిలర్ భర్త కర్రతో విచక్షణా రహితంగా దాడి చేసిన ఘటన జిల్లా కేంద్రంలో బుధవారం చోటు చేసుకున్నది. మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని 17వ వార్డు ఎర్రవెల్లితండా (పిల్లలమర్రి) వద్ద కార్మికులు ఎల్ఈడీ లైట్లు వేయడానికి వెళ్లగా తండా వాసులు చాలా రోజుల నుంచి లైట్లు వెలగడం లేదు, లైట్లు వేయడం లేదని అడగగా మున్సిపాలిటీ నుంచి లైట్లు వస్తే మేము వేసేవాళ్లమని వారు చెప్పారు. ఈ విషయాన్ని స్థానిక కౌన్సిలర్‌కు కాలనీవాసులు ఫిర్యాదు చేయగా కాంగ్రెస్ కౌన్సిలర్ జంగమ్మ భర్త పాపారాయుడు ఆవేశంగా వచ్చాడు. వచ్చి రాగానే మోసిన్, చిన్నాలను బూతులు తిడుతూ కర్రతో దాడి చేశాడు. వారు దాడి నుంచి తప్పించుకొని పారిపోవడానికి ప్రయత్నించినా ఆయనతోపాటు వారి అనుచరులు వెంబడించి మరీ దాడి చేయడంతో కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. కార్మికులు గాయాలతోనే రూరల్ పోలీస్‌స్టేషన్‌కు చేరుకొని ఎస్సై విజయ్‌కుమార్‌కు కౌన్సిలర్ భర్తతోపాటు దాడిచేసిన వారిపై ఫిర్యాదు చేశారు. అనంతరం పోలీసులు వారిని జిల్లా దవాఖానకు చికిత్స కోసం తరలించారు. ఈ విషయం తెలుసుకున్న సీఐటీయూ నాయకులు వెంటనే దవాఖానకు చేరుకొని గాయపడిన కార్మికులను పరామర్శించి వారికి మెరుగైన వైద్యసేవలు అందించాలని దవాఖాన సూపరింటెండెంట్ జీవన్‌కు విజ్ఞప్తి చేశా రు. అనంతరం సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు ఖమర్‌అలీ మాట్లాడుతూ కాంట్రాక్టు కార్మికులపై అకారణంగా దాడి చేసి గాయపర్చిన కాంగ్రెస్ కౌన్సిలర్ భర్త పాపారాయుడితోపాటు దాడికి పాల్పడిన వారిపై వెంటనే కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



# నువ్వా.. నేనా..!

- ప్రతిష్టాత్మకంగా ఎమ్మెల్సీ ఉప ఎన్నిక
- బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య తీవ్ర పోటీ
- వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్న బీఆర్ఎస్
- మరోసారి గెలుపు కోసం నేతల ప్రయత్నం
- ప్రజాప్రతినిధులతో మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, జిల్లా అధ్యక్షుల భేటీ
- 'హస్తం' పార్టీకి సంఖ్యా బలం కరువు
- జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లను ప్రలోభాలకు గురిచేస్తున్న పార్టీనేతలు
- అభ్యర్థికి, ఎమ్మెల్యేలకు కుదరని సయోధ్య
- బీజేపీతో ములాఖత్ అయిన కాంగ్రెస్

మహబూబ్‌నగర్, మార్చి 20 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : నేతల్లో ఎమ్మెల్సీ ఎన్నికల టెన్షన్ మొదలైంది. 28న జరిగే శాసన మండలి (ఎమ్మెల్సీ) ఉప ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా బీఆర్ఎస్ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నది. తమ పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు పట్టు జారకుండా మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు ప్రయత్నాలు ప్రారంభించారు. మరోవైపు అధికార కాంగ్రెస్ పార్టీ కూడా ప్రతిష్టాత్మకంగా తీసుకున్నది. తగినంత సంఖ్యా బలం లేకున్నా.. ఎలాగైనా గెలవాలని ఆ పార్టీ నేతలు భారీ ఎత్తున ప్రలోభాలకు గురిచేస్తున్నారు. మరోవైపు కేంద్రంలో కత్తులు దువ్వే కాంగ్రెస్, బీజేపీ ఈ ఎమ్మెల్సీ ఉపఎన్నికల్లో మిలాఖత్ కావడం చర్చనీయాంశంగా మారింది.

***కాంగ్రెస్ అభ్యర్థిపై ఎమ్మెల్యేల అసంతృప్తి***

అధికార కాంగ్రెస్ పార్టీలో శాసన మండలి ఉపఎన్నికలు చిచ్చు పెడ్తున్నాయి. మొన్నటి వరకు బీఆర్ఎస్‌లో ఉండి.. సడన్‌గా పార్టీలోకి వస్తే టికెట్ ఇవ్వడం ఏమిటని చాలా మంది ఎమ్మెల్యేలు అసంతృప్తిలో ఉన్నారు. పారిశ్రామికవేత్తను.. సీఎం నాకు తెలుసు.. అంటూ ఎమ్మెల్యేలనే డామినేట్ చేస్తున్నట్లు కొందరు శాసనసభ్యులు సీఎం దృష్టికి తీసుకెళ్లినట్లు ప్రచారం జరుగుతున్నది. ఇటీవల మహబూబ్‌నగర్‌లో నిర్వహించిన ప్రజాదీవెన సభలో సీఎం ఎమ్మెల్సీ అభ్యర్థిని ప్రకటించారు. కాగా అభ్యర్థి కాగానే తానే సొంతంగా నిర్ణయాలు తీసుకుని ముందుకుపోతుండటంతో పార్టీ నేతలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ నేతలతో కలిసి రాకుండా డబ్బు పడేస్తే ఓట్లు వస్తాయనే ధీమాలో ఉన్నారన్న ప్రచారం జోరుగా సాగుతున్నది. ఇది పార్టీకి నష్టమని సొంత పార్టీ నేతలే పేర్కొంటున్నారు. కాగా స్థానిక ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యేలను కాదని ఆయన అనుచరులను కలుస్తుండటం.. ఇతర పార్టీల ప్రజాప్రతినిధులను కూడా కలుస్తుండటంతో శాసనసభ్యులు ఖంగుతింటున్నారు. గతంలో అధికారంలో ఉన్నప్పుడు జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల రిజల్ట్ రిపీట్ అవుతుందేమోనని అంటున్నారు. దివంగత జగదీశ్వర్‌రెడ్డి కూడా పార్టీ నేతలను కాదని ఒంటెద్దు పోకడకు వెళ్లి ఓటమి పాలైన విషయాన్ని గుర్తు చేస్తున్నారు. మొత్తమ్మీద ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ అభ్యర్థి మధ్య విబేధాలు తారాస్థాయికి చేరుకోవడంతో ఏదో జరుగుతుందనే ఆందోళన నేతల్లో వ్యక్తమవుతున్నది.

## బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్యే పోటీ

ఎమ్మెల్సీ ఉపఎన్నికల్లో ప్రధాన పోటీ బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్యే ఉండనున్నది. బీఆర్ఎస్ తరపున మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ నవీన్ కుమార్‌రెడ్డిని రంగంలో దింపగా.. కాంగ్రెస్ నేతలు మాత్రం పారిశ్రామికవేత్తకు టికెట్ కేటాయించారు. దీంతో ఈ ఇద్దరి మధ్య నువ్వా.. నేనా.. అన్నట్లు పోటీ నెలకొననున్నది. రెండు పార్టీలు స్థానిక ప్రజాప్రతినిధులు జారిపోకుండా కాపాడుకుంటున్నారు. బీఆర్ఎస్ నేతలు ఈ ఎమ్మెల్సీని గెలిచి అధికార పార్టీకి షాక్ ఇచ్చేందుకు పావులు కదుపుతున్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో కొంతమంది మాత్రం పార్టీ మారినప్పటికీ చాలామంది పార్టీలోనే కొనసాగుతున్నారు. గద్వాల జిల్లాలో ఇద్దరు సిట్టింగ్ ఎమ్మెల్యేలు ఉండటంతో ఈ రెండు చోట్ల స్థానిక ప్రజాప్రతినిధులు బీఆర్ఎస్‌లోనే ఉన్నారు. ఇక వనపర్తి జిల్లాలో కూడా మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి పట్టుజారకుండా చర్యలు చేపట్టారు. మహబూబ్‌నగర్‌లో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, నాగర్‌కర్నూల్‌లో పార్టీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, నారాయణపేట జిల్లాలో పార్టీ అధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, కాంగ్రెస్ కన్నా ఎక్కువ ఓట్లు పడేలా ప్రయత్నాలు చేస్తున్నారు. రంగారెడ్డి జిల్లా పరిధిలోకి వచ్చే షాద్‌నగర్ నియోజకవర్గం పార్టీ క్యాండెట్‌దే కావడంతో కలిసి వచ్చే అంశం.

## వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్న బీఆర్ఎస్ నేతలు



28వ తేదీన జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల కోసం బీఆర్ఎస్ నేతలు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. ప్రజాప్రతినిధులను కలిసి పార్టీకే ఓటు వేసే విధంగా చూస్తున్నారు. నియోజకవర్గాల వారీగా మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు ఇన్‌చార్జిలుగా ఉండి గెలుపునకు ప్రయత్నిస్తున్నారు. మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిల వారీగా సమావేశాలు నిర్వహించి ప్రజాప్రతినిధులను కలుస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ నేతలు ప్రలోభాలకు పాల్పడితే తిప్పికొట్టాలని సూచిస్తున్నారు. అబద్ధపు ప్రచారం చేసి.. అమలుకు సాధ్యం కాని హామీలు ఇచ్చి అధికారంలో వచ్చిన కాంగ్రెస్ పార్టీ చర్యలను ఖండిస్తూ ప్రచారం చేస్తున్నారు. కాగా కేంద్రంలో కత్తులు దూసే బీజేపీ కాంగ్రెస్ ఇక్కడ మాత్రం మిలాఖత్ కావడంతో ఈ రెండు పార్టీలు ఒక్కటేనని అంటున్నారు. బీజేపీ ప్రజాప్రతినిధులంతా మనస్సాక్షిగా ఓటు వేయాలని బీఆర్ఎస్ నేతలు పేర్కొంటున్నారు. కాగా కాంగ్రెస్ నేతలకు చెక్‌పెట్టేందుకు పార్టీ నేతలు ఒకటికి రెండు సార్లు ఆలోచనలతో అడుగులు వేస్తున్నారు. ఈ ఉపఎన్నికల్లో గెలిచి తీరాలని.. అధికార పార్టీకి దిమ్మదిరిగేలా జవాబు ఇవ్వాలని పార్టీ నేతలు భావిస్తున్నారు. ఈ ఉప ఎన్నికలను బీఆర్ఎస్ సవాల్‌గా తీసుకున్నది.

## కాంగ్రెస్ ప్రలోభాలు.. బీజేపీతో ములాఖత్

కాంగ్రెస్‌కు స్థానిక ప్రజాప్రతినిధుల్లో తగినంత సంఖ్యాబలం లేదు. దీంతో ఆ పార్టీ నేతలు భారీ ప్రలోభాలకు పాల్పడుతున్నారు. ఒక్కో ఓటుకు పెద్ద ఎత్తున డబ్బులు ఎర చూపుతున్నారు. అంతేగాక అసెంబ్లీ ఎన్నికల్లో చేసిన ట్రిక్‌ను ప్లే చేస్తున్నారు. సోషల్ మీడియా వేదికగా ప్రజాప్రతినిధులు చేరినట్లు సృష్టిస్తున్నారు. ఇదిఇలా ఉండగా విపక్షంగా వ్యవహరించాల్సిన బీజేపీ నేతలు, కాంగ్రెస్ నాయకులతో కలిసి ఎమ్మెల్సీ ఎన్నికల్లో పాల్గొంటుండడం.. ఆ పార్టీ నేతలే బాహాటంగా ప్రచారం చేస్తుండడం గమనార్హం. కాంగ్రెస్, బీజేపీల మిలాఖత్ ఉప ఎన్నికల్లో చర్చనీయాంశంగా మారింది.

## ఉమ్మడి జిల్లాలో 1,439 మంది ఓట్లు

మహబూబ్‌నగర్ ప్రజాప్రతినిధుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో మొత్తం 1,439 ఓట్లు ఉన్నాయి. మొత్తం 16 మంది నామినేషన్లు దాఖలు చేయగా.. వారిలో 10 మంది నామినేషన్లు విత్‌డ్రా చేసుకున్నారు. మరో ముగ్గురి నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. ప్రస్తుతం బరిలో మొత్తం ముగ్గురు అభ్యర్థులు మిగిలారు. బీఆర్ఎస్ తరపున నవీన్‌కుమార్‌రెడ్డి, కాంగ్రెస్ తరపున జీవన్‌రెడ్డి, స్వతంత్ర అభ్యర్థి సుదర్శన్ గౌడ్ పోటీలో మిగిలారు. అయితే పోటీ మాత్రం బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్యే ఉన్నది. ఈ రెండు పార్టీలు నువ్వానేనా అన్నట్లు పోటీ పడుతున్నాయి. కాగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు ఓటింగ్‌లో పాల్గొంటారు. 2021లో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలోని రెండు ఎమ్మెల్సీ స్థానాలను బీఆర్ఎస్ ఏకగ్రీవంగా గెలుచుకున్నది. కాగా ఇందులో ఒక ఎమ్మెల్సీ పార్టీ మారి ఎమ్మెల్యేగా గెలవడం.. పదవికి రాజీనామా చేయడంతో ఎన్నికల సంఘం ఉప ఎన్నిక నిర్వహిస్తున్నది. కాగా మార్చి 28న జరిగే పోలింగ్ కోసం అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రెవెన్యూ డివిజన్ కేంద్రాల్లో పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేశారు. పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, పాలమూరు కలెక్టర్ రవినాయక్ తెలిపారు.

## అడ్డంకులు తొలగిస్తే పూర్తి చేస్తాం..



జిల్లా కేంద్రంలో మిగిలిన రోడ్డు విస్తరణ పనులను పూర్తి చేయాలంటే అడ్డంకులను తొలగించాలి. విద్యుత్ స్తంభాలు తొలగించడంతోపాటు డ్రైనేజీ నిర్మాణాలు చేపట్టాలి. ఇవి పూర్తి చేస్తే మిగిలిన రోడ్డు పనులను కొనసాగిస్తాం. మున్సిపాలిటీ, విద్యుత్ శాఖ పరిధిలో ఉన్న పనులను చేపడితే మా పని చేయడం సులభమవుతుంది. మొత్తంగా పెండింగ్‌లో ఉన్న పనులకు చేయాలనుకుంటున్నాం, దీని కోసం కాంట్రాక్టర్‌ను కూడా సంప్రదిస్తున్నాం.

*– దేశ్యా నాయక్, ఈఈ, రోడ్లు భవనాల శాఖ, వనపర్తి*



వనపర్తి పట్టణంలో అసంపూర్తిగా బ్రిడ్జి నిర్మాణ పనులు

# విస్తరణకు విరామం!

- అర్ధాంతరంగా నిలిచిన రోడ్డు పనులు
- సర్దుకుంటున్న షాపుల యజమానులు
- ప్రజల చిరకాలవాంఛకు బ్రేకులు
- అయోమయంలో పట్టణవాసులు

వనపర్తి, మార్చి 20 (నమస్తే తెలంగాణ) : జిల్లా కేంద్రంలో చేపట్టిన రోడ్ల విస్తరణ అర్ధాంతరంగా నిలిచి పోయింది. అసెంబ్లీ ఎన్నికల అనంతరం విస్తరణ పనులు ఒక్క అడుగూ ముందుకు పడలేదు. ఎన్నికలకు ముందు ఉరుకులు.. పరుగుల మీద కొనసాగిన రోడ్ల విస్తరణ పనులు ఎన్నికల అనంతరం విరామం అన్నట్లుగా కనిపిస్తున్నది. అసంపూర్తి పనులు.. అసౌకర్యమైన రోడ్లతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. దశాబ్దాల తరబడి రోడ్ల విస్తరణ కోసం ఎదురు చూసిన పట్టణ ప్రజల ఆశలపై నీళ్లు చల్లినట్లుగా కనిపిస్తున్నది.

***రూ.49 కోట్లతో..***

జిల్లా కేంద్రంలో రోడ్ల విస్తరణను రూ.49.7కోట్ల అంచనాతో చేపట్టారు. గత ఏడాదిలో ప్రారంభమైన ఈ పనులను నాలుగు విభాగాలుగా చేశారు. వీటిలో చిట్యాల రోడ్డు, గోపాల్‌పేటరోడ్డు, పాన్‌గల్ రోడ్డు, పెబ్బేరు రోడ్లు ఉన్నాయి. వీటిలో చిట్యాల, గోపాల్‌పేట రోడ్డు పనులు కొంతమేర జరిగాయి. గోపాల్‌పేట రోడ్డు వైపు విస్తరణలో మూడు కిలోమీటర్ల రోడ్డుంటే, 2.85 కిలో మీటర్ల రోడ్డును పూర్తి చేశారు. మరో రెండు బ్రిడ్జిలు ఉండగా, ఒకటి జెర్రిపోతుల మైసమ్మవాగు దగ్గర ఉంటే, మరొకటి పట్టణంలోని రామ టాకీస్ దగ్గర నిర్మించారు. కేవలం రామ టాకీస్ దగ్గర మాత్రమే రోడ్డు వేయాల్సి ఉండగా, రెండు విద్యుత్ స్తంభాలు, డ్రైనేజీ పనులు చేపడితే మిగిలిన రోడ్డును వేసేందుకు వీలవుతుంది. రూ.27కోట్లతో గోపాల్‌పేట రోడ్డు విస్తరణ పనులను చేపట్టారు. అలాగే చిట్యాల రోడ్డు విస్తరణ పనుల వారీగా చూస్తే.. ఇందులోనూ 3 కిలోమీటర్ల రోడ్డుకు గానూ దాదాపు అన్ని పనులు చేశారు. డ్రైనేజీల నిర్మాణం, విద్యుత్ స్తంభాల తొలగింపులాంటివన్నీ ఎన్నికలకు ముందే చేపట్టారు. చింతల హనుమాన్ ఆలయ సమీపంలో బ్రిడ్జిని నిర్మించారు. వీటిని రూ.22.7కోట్ల అంచనాతో చేపట్టారు. ఇక పాన్‌గల్ రోడ్డు విస్తరణ పనులను చూస్తే.. ఇక్కడ కిలోమీటర్ రోడ్డు వేయాల్సి ఉంటే కేవలం 400 మీటర్లు మాత్రమే వేశారు. ఇంకా ఇండ్లు తొలగించడం, డ్రైనేజీ నిర్మాణ పనులు, విద్యుత్ స్తంభాల తొలగింపులాంటి పనులన్నీ పెండింగ్‌లోనే ఉన్నాయి.



అర్ధాంతరంగా నిలిచిపోయిన రోడ్డు విస్తరణ పనులు

***మొదలుకాని పెబ్బేరు రోడ్డు పనులు..***

పెబ్బేరు రోడ్డులో కిలోమీటరు మేర రోడ్డు పనులు వేయాల్సి ఉన్నది. ఇది పూర్తిగా పెండింగ్‌లోనే ఉన్నది. కేవలం డ్రైనేజీ కోసం నిర్మాణాలు తొలగించడం మాత్రమే చేశారు. మరికొన్ని చోట్ల ఇండ్ల నిర్మాణాలను యజమానులే తొలగించుకోగా, మరికొన్ని అలాగే ఉన్నాయి. ఇక వీటితోనే విస్తరణ పనులు నిలిచిపోయాయి. కొంత మేర డ్రైనేజీని ఏర్పాటు చేసి వదిలేశారు. ఇంకా ఇండ్ల తొలగింపు, విద్యుత్ స్తంభాలను తీసివేయడం, డ్రైనేజీని పూర్తి స్థాయిలో చేపట్టాల్సి ఉన్నది. అయితే ఇప్పటి వరకు రోడ్డు విస్తరణకు సంబంధించి రూ.17 కోట్ల పనులకు రికార్డులు కాగా రూ.8 కోట్ల బిల్లులు కాంట్రాక్టర్‌కు పెండింగ్‌లో ఉన్నాయి. మిగిలిన పెండిం గ్ బిల్లులు వస్తే తప్పా పనులు చేస్తామన్న ఆలోచనలో కాంట్రాక్టర్ ఉన్నట్లు తెలుస్తున్నది.

***సర్దుకుంటున్న యజమానులు..***

రోడ్ల విస్తరణ పేరుతో తొలగించిన కట్టడాలు ఎక్కడికక్కడ అర్ధాంతరంగా నిలిచిపోయాయి. నెలల తరబడి పనులు నిలిచిపోవడంతో షాపుల యజమానులే తొలగించిన కట్టడాలను సరి చేసుకుంటున్నారు. డ్రైనేజీల కోసం కాల్వలు తవ్వి వదిలివేయడంతో ఇప్పట్లో ఇక డ్రైనేజీ నిర్మించే పరిస్థితి లేదన్న అంచనాతో ప్రత్యామ్నాయాలను ఏర్పాటు చేసుకుంటున్నారు. వీటినిబట్టి రోడ్ల విస్తరణ పనులకు పూర్తిగా విరామం ఇచ్చారన్న చర్చ జోరుగా సాగుతున్నది. ఇటీవలి మున్సిపల్ బడ్జెట్ సమావేశంలోనూ రోడ్ల విస్తరణపై చర్చ వచ్చినా పనులు జరుగుతాయన్న నిర్ణయం రాకపోవడంతో పట్టణ ప్రజలు నిరాశకు లోనవుతున్నారు.

***చిన్నారెడ్డి ప్రకటనతో ఆశలు..***

ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన చిన్నారెడ్డి గత ప్రభుత్వ హయాంలో నిలిచిపోయిన పనులన్నింటినీ పూర్తి చేయించే బాధ్యత తీసుకుంటానని ప్రకటించడంతో ఆశలు చిగురిస్తున్నాయి. జిల్లాకేంద్రంలో రోడ్డు విస్తరణ పనులతోపాటు మరిన్ని మిగిలి ఉన్నాయి. వీటిలో చాలా వరకు పూర్తికాగా కొన్ని చివరి దశలో, మరికొన్ని పూర్తయినా నిరుపయోగంగా ఉన్నాయి. వనపర్తి అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని వీటన్నింటినీ పూర్తి చేస్తామని ప్రకటించారు. దీంతోనైనా నిలిచిన రోడ్ల విస్తరణకు మోక్షం వస్తుందేమో వేచి చూడాలి.

# అ'పూర్వ'ం@51

పెద్దమందడి, మార్చి 20 : మండలంలోని బలిజపల్లి, జంగమాయిపల్లి ఉన్నత పాఠశాలలో 1972–73 ఏడో తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు బుధవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. వివిధ రంగాల్లో స్థిరపడిన వారంతా 51 ఏండ్ల తర్వాత కలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకొని ఆనందంగా గడిపారు. అదే విధంగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులు వేణుగోపాల్‌శెట్టి, నారాయణరెడ్డిని పూలమాల, శాలువాలు కప్పి సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు జగన్‌మోహన్‌గౌడ్, నరసింహారెడ్డి, వేణుగోపాల్ శెట్టి, ప్రభాకర్‌రెడ్డి, మల్లెల నాగిరెడ్డి, నర్సింహారావు, గో వర్ధన్‌రెడ్డి, యాదవరెడ్డి, గోపాల్‌రెడ్డి, పురుషోత్తంశెట్టి తదితరులు పాల్గొన్నారు.



గురువులను సన్మానిస్తున్న 1972–73 బ్యాచ్ పూర్వ విద్యార్థులు

# రూ.5.37 లక్షలు పట్టివేత

వనపర్తి టౌన్, మార్చి 20 : పార్లమెంట్ ఎన్నికల నియమావళిలో భాగంగా జిల్లావ్యాప్తంగా నిర్వహించిన పోలీస్ తనిఖీల్లో రూ.5,37,500 నగదుతోపాటు 35.39 లీటర్ల మద్యం సీజ్ చేసినట్లు పోలీస్ అధికారులు తెలిపారు. పాన్‌గల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కొత్తపేట ఎక్స్‌రోడ్డు వద్ద రూ.3.47లక్షలు, 25.25 లీటర్ల మద్యం, పెబ్బేరు చెక్‌పోస్టు వద్ద రూ.79,500 నగదు, అమరచింత పరిధిలోని నాగల్‌కడ్మూర్ చెక్‌పోస్ట్ వద్ద రూ.లక్షా11వేల నగదు, ఖిల్లాఘణపురం పోలీస్ స్టేషన్ పరిధిలో 8.8లీటర్ల మద్యం, వీపనగండ్ల పోలీస్ స్టేషన్ పరిధిలో 7 లీటర్ల మద్యం, గోపాల్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో 7 లీటర్ల మద్యం, శ్రీరంగాపురం పరిధిలో 11.4 లీటర్ల మద్యం పట్టుబడినట్లు పోలీసులు తెలిపారు.

***వాహనాల వేలం***

జిల్లా కేంద్రంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వాహనాల వేలం ద్వారా రూ.3.60లక్షల ఆదాయం వచ్చిందని డీఎస్పీ వెంకటేశ్వర్‌రావు, ఏఆర్ అదనపు ఎస్పీ వీరారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లలోని 73 బైకులు, 5 ఆటోలకు వేలం నిర్వహించగా 23 మంది వేలంలో పాల్గొన్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పట్టణ సీఐ నాగభూషణం, రిజర్వ్‌డ్ ఎస్సై శ్రీనివాస్ పాల్గొన్నారు.



పాన్‌గల్‌లో వాహనాన్ని తనిఖీ చేస్తున్న ఎస్సై వేణు